# నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

మంగళవారం 5 డిసెంబర్ 2023
TUESDAY, DECEMBER 5, 2023 | VIKARABAD | పేజీలు : 8 PAGES







**కృతజ్ఞతలు సార్**

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సోమవారం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసినవారిలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తోపాటు ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తిక్‌రెడ్డి ఉన్నారు.

# నోటాకు 14,874 ఓట్లు

**అత్యధికంగా శేరిలింగంపల్లిలో 3,145 ఓట్లు..**

రంగారెడ్డి, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ) : పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా నన్ ఆఫ్ ది ఎబో(నోటా)ను ప్రతి ఈవీఎంలో చివరన అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో 14,874 మంది 'నోటా'కు జై కొట్టారు. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 3,145 మంది నోటా ఆప్షన్‌ను ఎంచుకుంటే.. అత్యల్పంగా కల్వకుర్తిలో 661 మంది నోటా వైపు మొగ్గు చూపారు. గత ఎన్నికలతో పోలిస్తే నోటాను ఎంచుకుంటున్న ఓటర్ల సంఖ్య తగ్గుతూ వస్తున్నదని అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో నోటాకు వచ్చిన ఓట్లను నియోజవర్గాల వారీగా పరిశీలిస్తే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 1,427, చేవెళ్ల 1,423, కల్వకుర్తి 661, ఎల్బీనగర్ 2,966, మహేశ్వరం 2,031, రాజేంద్రనగర్ 1,832, షాద్‌నగర్ 1,389, శేరిలింగంపల్లిలో 3,145 ఓట్లు పోల్ అయ్యాయి.



ప్రత్యేక అలంకరణలో శివలింగం

## ఘనంగా కార్తిక పూజలు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 4: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని శ్రీలలితా భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



పెద్దఅంబర్‌పేట : భక్తులతో కిక్కిరిసిన ఆలయం

# 52 మంది అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు

- మూడు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకూ చుక్కెదురు..
- పరిగి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థికి మాత్రమే డిపాజిట్..
- గత ఎన్నికలతో పోలిస్తే 4 సెగ్మెంట్లలోనూ కాంగ్రెస్‌కు పెరిగిన ఓటింగ్ శాతం
- వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు పెరిగిన ఓటింగ్ పర్సంటేజ్
- అత్యధికంగా కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డికి 55.04 శాతం ఓట్లు
- వికారాబాద్ ఎమ్మెల్యేకు 48.67 శాతం, పరిగి ఎమ్మెల్యేకు 48.38 శాతం, తాండూరు ఎమ్మెల్యేకు 48.36 శాతం ఓట్లు





వికారాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 52 మంది అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతయ్యాయి. గెలిచిన అభ్యర్థితోపాటు సమీప ప్రత్యర్థి మినహా మిగతా ఎవరికీ డిపాజిట్ దక్కలేదు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గెలుపొందినవారు, సమీప ప్రత్యర్థులు కాకుండా పరిగి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి బూనేటి కిరణ్ మాత్రమే డిపాజిట్ సాధించారు. మిగతా వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులకూ డిపాజిట్ దక్కకపోవడం గమనార్హం. కమలం పార్టీ అభ్యర్థులకు మద్దతుగా అస్సాం సీఎం, జార్ఖండ్ మాజీ సీఎం అర్జున్ ముండా వచ్చి ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోలేదు. వికారాబాద్ నియోజకవర్గంలో 10 మంది, పరిగి 12 మందికి, తాండూరు 19 మంది, కొడంగల్ 11 మంది అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు. కొందరు అభ్యర్థులకు ఆయా నియోజకవర్గాల్లో నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాకపోవడం గమనార్హం. అదేవిధంగా జిల్లాలో అత్యధిక ఓట్ల శాతం కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డికి వచ్చింది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డికి 55.04 శాతం ఓట్లు, వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే జి.ప్రసాద్‌కుమార్‌కు 48.67 శాతం ఓట్లు, పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డికి 48.38 శాతం ఓట్లు, తాండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డికి 48.36 శాతం ఓట్లు, వచ్చాయి. అదేవిధంగా గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికలతో పోలిస్తే వికారాబాద్, తాండూరు నియోజకవర్గంలో మాత్రమే బీఆర్ఎస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరిగింది. కొడంగల్ నియోజకవర్గంలో 12 శాతం ఓట్లు పెరగగా, వికారాబాద్ నియోజకవర్గంలో 11 శాతం, పరిగి నియోజకవర్గంలో 10 శాతం, తాండూరు నియోజకవర్గంలో 4 శాతం మేర ఓట్లు పెరిగాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి వికారాబాద్ నియోజకవర్గంలో 4 శాతం మేర ఓట్లు, తాండూరు నియోజకవర్గంలో 1 శాతం ఓట్లు పెరగగా, పరిగి నియోజకవర్గంలో 10 శాతం, కొడంగల్ నియోజకవర్గంలో 10 శాతం మేర ఓట్లు తగ్గాయి.